క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పెడన: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెడన ఎంఈఓ-1 ఎంవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన దక్షిణ తెలుగుపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో చదవించడం, వారితో బోధన బోర్డుపై రాయించడం వంటివి చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గమనించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. రాగి జావ రుచికరంగా ఉందని ప్రశంసించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటర్ల సర్వే పరిశీలన

కృత్తివెన్ను: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఓటర్ల సర్వే పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని డెప్యూటీ తహసీల్దార్ శశికుమార్ అన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి నమోదైన ఓటర్ల పేర్లు లిస్టులో ఉన్నదీ, లేనిదీ పరిశీలించారన్నారు. దీంతో పాటు 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటు హక్కు కల్పించడం, చనిపోయిన, వివాహాలు జరిగి వెళ్లిపోయిన వారి వివరాలు తీసుకుని తొలగింపులు తదితర ప్రక్రియ చేస్తున్నామని వివరించారు.

వృద్ధురాలి కార్నియాల సేకరణ



కోటేశ్వరమ్మ (ఫైల్)

నాగాయలంక: 12వ వార్డుకు చెందిన గరికపాటి కోటేశ్వరమ్మ (75) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ తాడిగడపలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణ సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ బృందం మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం



భావదేవరపల్లి (నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసంలో తొలి మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని మంగళగౌరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీహరి బ్రహ్మత్వంలో 70 మంది మహిళలు మంగళగౌరీ వ్రతం చేశారు. అనంతరం మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షణలో పూషడపు శివ సత్యవతి, సంధ్య పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడిపై దాడి.. కేసు నమోదు

పెడన: కో-ఆప్షన్ సభ్యుడు వీరంకి నరసింహారావుపై నలుగురు దాడి చేశారు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాల సాయికి చెందిన మేక నరసింహారావు పొలంలోని పంటను నాశనం చేస్తుండటంతో నరసింహారావు ఈ నెల 20వ తేదీన మందలించాడు. ఆ గొడవను మనస్సులో పెట్టుకున్న సాయి తన భార్యతో పాటు పిట్ల నాంచారయ్య, పిట్ల దుర్గతో కలిసి నరసింహారావుపై ఈనెల 21వ తేదీ రాత్రి దాడి చేసి గాయపరిచారు. బాధితుడు నరసింహారావును మచిలీపట్నం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు పెడన పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శాంతి ర్యాలీ



పామర్రు: సమాజం శాంతియుతంగా ఉండాలి అంటే ప్రజల్లో సమతాభావం పెరగాలని దీనికి మానవత సేవాసంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పామర్రు ఎస్‌ఐ పీవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. మానవత సేవాసంస్థ పామర్రు శాఖ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో శాంతి ర్యాలీ జరిగింది. ప్రపంచ శాంతిని కోరుకుంటూ స్థానిక ప్రతాప్ కాలేజీ నుంచి విద్యార్థులు, మానవత సభ్యులు శాంతియుత ర్యాలీని అంకమ్మ తల్లి ఆలయం వరకు నిర్వహించారు. అక్కడ జరిగిన సభకు ముఖ్య అతిథిగా ఎస్‌ఐ పాల్గొని మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సేవాసంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. పామర్రు మానవత అధ్యక్షులు ఐవీఎస్ మనోహర్ రావు, డైరెక్టర్ కర్రై శ్రీధర్ వితరణతో పేదలకు వస్త్రాలను బహూకరించారు. మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు అరిగిల బాలుడు, వైస్ చైర్మన్ బొమ్మారెడ్డి కోటిరెడ్డి, పామర్తి వెంకట నారాయణ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను సిద్ధం చేయండి

ఆర్డీఓ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ అన్నారు. ఆయన కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై నియమించిన సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ఓటరు పలు చోట్ల ఉన్నట్లు గుర్తిస్తే ఏయే ప్రాంతాల్లో ఓటు ఉన్నది పరిశీలించి ఆ ఓటరు నుంచి లిఖిత పూర్వకమైన అభ్యర్థనను తీసుకుని ఎక్కడ ఓటు ఉంచమంటే ఆ ప్రాంతంలోనే ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఓటును తొలగించాల్సి వచ్చినప్పుడు పరిసర ప్రాంతాల్లో విచారణ జరపడంతో పాటు సంబంధిత బూత్ లెవల్‌లో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి తిరస్కరణకు సిఫార్సు చేయాలని చెప్పారు. చనిపోయిన ఓటర్లను తొలగించేటప్పుడు వారి డెత్ సర్టిఫికెట్‌ను సేకరించి దీని ఆధారంగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ సిబ్బందికి ఈ నిబంధనలపై అవగాహన కల్పించి జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా స్వచ్ఛమైన జాబితా తయారు చేసేలా చూడాలని ఆర్డీఓ సూచించారు. తహసీల్దార్ శ్రీవిద్య, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

విచారణ పారదర్శకంగా ఉండాలి..



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రాజ్యలక్ష్మి

పెడన: ఓటర్ల సమగ్ర సర్వే ప్రక్రియ పూర్తయిందని, సర్వే సమయంలో వచ్చిన దరఖాస్తులతో పాటు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి జాబితా రూపొందించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో తొలుత సమావేశమయ్యారు. అనంతరం షాదీఖానాలో బూత్‌లెవల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫారం-6 ద్వారా 1,729, ఫారం-7కు 1,255, ఫారం-8కు పది వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

వీటిపై పూర్తి స్థాయిలో విచారణ చేసిన అనంతరం ఓటరు జాబితాలో పొందుపరుస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బండారు మల్లి, కొండవీటి నాగబాబు, టీడీపీ నుంచి శెలపాటి ప్రసాద్, యక్కల శ్యామలయ్య, పావని, శంకర్, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలకు చెందిన వారితో పాటు తహసీల్దార్ పి. మధుసూధనరావు పాల్గొన్నారు. అనంతరం బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమీక్షలో దరఖాస్తులను పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని ఆదేశించారు.

జోరు వర్షం..పంటలకు జీవం

- అల్పపీడన ప్రభావంతో మారిన వాతావరణం
- ఉరుములు, మెరుపులతో వర్షం
- రైతుల హర్షం



కంకిపాడులో సాగులో ఉన్న వరి పొలం

కంకిపాడు: అల్పపీడన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. కంకిపాడు పరిసర ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటుగా, ఉక్కపోత, వేడిగాలులకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అల్పపీడన ప్రభావంతో మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతమై కారుమబ్బులు కమ్మేశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కారణంగా బస్టాండ్ సెంటరు, రైతుబజారు, కంకిపాడు, పునాదిపాడు అండర్‌పాస్‌ల వద్ద వర్షం నీరు నిలిచిపోయింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడ్డారు. వాతావరణం మార్పు చెంది వర్షం కురవడంతో ప్రజలు ఊరట చెందారు.

పంటలకు జీవం..

ఈ వర్షం పంటలకు జీవం పోస్తుందని రైతులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వర్షం కురవకపోవడంతో కేవలం పంట కాలువ నీరు, బోరు నీటి ద్వారా పంట పొలాలను సాగుచేస్తున్నారు. కురిసిన మోస్తరు వర్షం పొలాలకు అవసరమైన జీవాన్ని అందిస్తుందంటున్నారు. ముఖ్యంగా వరి నాట్లు పూర్తయిన పొలాలు నిలదొక్కుకుని దుబ్బులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. పసుపు, అరటి, కంద, కూరగాయ పంటలు మొక్క దశలో ఉన్నాయి. వర్షం మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉయ్యూరు బైపాస్ మార్గంలో కురుస్తున్న వర్షం

ఉయ్యూరు: ఉయ్యూరులో మంగళవారం జోరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లలో వర్షంనీరు నిలిచిపోయింది. వర్షం వరి చేలకు మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరితో పాటు వాణిజ్య పంటలకూ జోరు వాన ఉపయుక్తంగా మారింది.

ఘనంగా కడవకొల్లు జన్మదిన వేడుకలు



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు జన్మదిన వేడుకలను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు చేదోడు వాదోడుగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కడవకొల్లు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోపిదేవి: మోపిదేవి ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సర్పంచ్‌లు నందిగం మేరీ రాణి, గరికపాటి వెంకటేశ్వరరావు, కొలసాని వెంకటకృష్ణ, పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కోడూరు: కడవకొల్లు స్వగ్రామమైన మందపాకల గ్రామంలో యువ నేత సింహాద్రి వికాస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కోడూరులో జరిగిన వేడుకల్లో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, పరిశె మాధవరావు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించండి

విద్యుత్ సీఎండీ సుబ్బారావు



మచిలీపట్నంటౌన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని విద్యుత్ శాఖ సీఎండీ డి. సుబ్బారావు అన్నారు. నగరంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో మచిలీపట్నం డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావు, డీఈ, ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

165 మందికి క్యాన్సర్ పరీక్షలు



మొబైల్ వైద్యశాల వద్ద మణిపాల్ హాస్పటల్ టీమ్ సభ్యులతో లయన్స్ క్లబ్ సభ్యులు

పామర్రు: లయన్స్ క్లబ్ ఆఫ్ పామర్రు సౌజన్యంతో విజయవాడ మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ పరీక్ష కేంద్రానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 165 మందికి క్యాన్సర్ పరీక్షలు చేశారు. క్యాంపులో మణిపాల్ మొబైల్ వైద్యశాలలో టెక్నికల్ టీమ్ సభ్యుల ఆధ్వర్యాన పరీక్షలు చేశారు. వీటి వివరాలను ఆన్‌లైన్‌లో మణిపాల్ వైద్యశాలకు పంపి వాటి ఫలితాలు రెండు రోజుల్లో తెలియజేస్తారు. అనంతరం మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. దీనికి మహిళలు ఆరోగ్య సంరక్షణకు పామర్రు క్లబ్ వైద్య శిబిరాలను నిర్వహించి కృషి చేస్తోందన్నారు. విజయవాడ లయన్స్ విరాట్ క్లబ్ అధ్యక్షులు మేడా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయించుకోవచ్చున్నారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లయన్స్ జిల్లా నేత కూనపరెడ్డిచంద్రశేఖర్‌రావు, కోశాధికారి నవులూరి వీర వెంకయ్య, జిల్లా ప్రతినిధులు బైసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న అరుణాచలానికి బస్ సర్వీస్

గుడివాడ టౌన్: అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుడివాడ ఆర్టీసీ డిపో సూపర్‌లగ్జరీ బస్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాజేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ రాత్రి 8 గంటలకు గుడివాడ నుంచి బయలుదేరి 30వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుని మధ్యాహ్నం 2 గంటకు కాణిపాకం, రాత్రికి గోల్డెన్‌టెంపుల్ చేరుకుంటుందని వివరించారు. 31వ తేదీ అరుణాచలం గిరి ప్రదక్షిణలు పూర్తిచేసుకుని బయలుదేరిన బస్సు 1వ తేదీ ఉదయం గుడివాడకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర రూ.3 వేలు అని పేర్కొన్నారు. వివరాలకు 7382903299, 9177101904 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆపదలో ఆదుకున్న వ్యక్తికి సన్మానం



గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ గుడివాడ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి ఆధ్వర్యాన జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో ఇటీవల బొమ్ములూరు రోడ్‌లో యాక్సిడెంట్‌లో గాయపడిన వ్యక్తి బీవీఎస్ వరప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు వచ్చే వరకు పర్యవేక్షణ చేసిన అజయ్‌కుమార్‌ను సత్కరించి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న బి.వెంకటేశ్వరరావుకు రూ 5 వేలు వితరణ అందజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ పీవీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

115 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కంకిపాడు: కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కుందేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 115 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో కంటి సమస్యలు అధికంగా వస్తాయన్నారు. ప్రాథమిక దశలోనే సమస్యను గుర్తించి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెడన: పెడన పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని పురపాలక సంఘ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 18 అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఇంటింటా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతూ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మందపాకల సచివాలయ పరిధిలోని పోటు మీద గ్రామంలో రమేష్‌బాబు, యువ నేత సింహాద్రి వికాస్‌లు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రమేష్‌బాబు 649 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాల్లో మహిళలను భాగస్వాములను చేయడంతో పాటు పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించేందుకు విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారన్నారు. నాలుగేళ్లలో అన్నివర్గాల ప్రజలకు ఇంటి ముంగిటకే సంక్షేమాన్ని అందించామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ ఇంటి ముంగిటకే పథకాలు అందుతున్నాయంటూ హర్షం వ్యక్తం చేశారు. ఒకటో తేదీన తెల్లవారకముందే వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్ నగదును అందిస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచి అద్దంకి శివప్రసాద్, ఉప్పాల లక్ష్మి, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, పరిశె వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, నేతలు కడవకొల్లు నాగమల్లేశ్వరరావు, పూర్ణచంద్రరరావు, మత్స్యకార నేత చిలకలపూడి ధర్మయ్య పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న సీఎం జగన్

పేర్ని కిట్టు



లబ్ధిదారులకు మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదలను ఆదుకుంటూ వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మూడో డివిజన్ పెయింటర్స్ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పేర్ని కిట్టు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ లబ్ధి వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో పేదలు ఆనందంగా జీవిస్తున్నారని చెప్పారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, చీలి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కప్పలదొడ్డిలో నాలుగు పూరిళ్లు దగ్ధం



బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న నాయకులు

గూడూరు: గూడూరు మండలం కప్పలదొడ్డిలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఉదయం 7.30 గంటల సమయంలో మేకా అంజనేయులుకు చెందిన తాటాకు ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగాయి. అదే సమయంలో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మరో మూడు తాటాకు ఇళ్లను దగ్ధం చేశాయి. సమాచారం అందుకున్న బందరు అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో మేకా ఆంజనేయులు, మేకా సీతారావమ్మ, కోట సూరిబాబు, కోట సీతమ్మ కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లో ఉన్న సామగ్రి కాలిబూడిదయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అగ్ని ప్రమాదంలో మేకా పైడమ్మ (65), షేక్ మస్తాన్ (42)లకు గాయాలయ్యాయి. బాధితులను బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం జరిగింది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బాధితులకు నిత్యావసరాల పంపిణీ..

విషయం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ బాధితులకు తన వంతుగా ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు గూడూరు ఎంపీపీ నంగా మధుసూదనరావు, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు తదితరులు బాధితులను పరామర్శించారు. మంత్రి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు నగదు, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందజేశారు. ప్రభుత్వం ద్వారా బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

టీడీపీ నీచ రాజకీయాలు మానుకోవాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య



విలేకరులతో మాట్లాడుతున్న బసవయ్య, వెంకటేశ్వరరావు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు అన్నారు. దళితులను అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రికి దళితుల ఆదరణ రోజురోజుకీ పెరుగుతున్నందున టీడీపీ నాయకులు చౌకబారు విమర్శలకు పాల్పడుతున్నారని చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తొలిసారి ఎస్సీలకు ఇచ్చిన ఘనత స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుదేనని చెప్పారురు. టీడీపీకి రోజురోజుకి ప్రజల నుంచి ఆదరణ తగ్గడంతో ఉనికి కోసం కిరాయి హంతకులు, రాజకీయ బ్రోకర్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై చైకబారు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, దాసి హాజిబాబు, గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యాన 120 మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. తొలుత స్వామివారి పుట్టలో పాలు పోసి పాల పొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు.

- నిత్యావసరాలు అందజేత

గూడూరు: రాయవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఊసా పాండురంగారావు కుటుంబానికి మచిలీపట్నం చలమలశెట్టి ట్రస్ట్ తన వంతు సహాయం అందించింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు, అడ్డాల నెహ్రూలు బాధితులకు నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు అందజేశారు.